క్లుప్తంగా

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఎంపీడీఓలు



కాటారం: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును సోమవారం మంథనిలో జయశంకర్‌భూపాలపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్ది ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాలోతు శంకర్‌నాయక్, ఎంపీడీఓలు రవీంద్రానాథ్, చల్ల ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



వాజేడు: మండల పరిధిలోని కొప్పుసూరు గ్రామంలో సోమవారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు సౌమిత్రి వేణు గోపాల చార్యులు, పలువురు వేద మంత్రాల నడుమ విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం స్వామి వారికి పాలాభిషేకం చేసి ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.

దాడికేసులో ఒకరి అరెస్టు

మహాముత్తారం: దాడికేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మండలంలోని నల్లగుంటమీనాజీపేట, కిష్టాపూర్ గ్రామాల మధ్య నవంబర్ 21న జరిగిన దాడికేసులో మీనాజీపేట గ్రామానికి చెందిన మంకుర్తి సారయ్య అనే వ్యక్తిని సోమవారం రిమాండ్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిధులు కేటాయించాలి

ములుగు రూరల్: ఆదివాసీ ఆరాధ్య దైవాల ఆలయాలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని గుట్టమీది ముసలయ్య ఆలయ ప్రచార కార్యదర్శి గుండమీది వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రం అందించారు. మేడారం జాతరకు నిధులు కేటాయించిన విధంగా మిగతా ఆదివాసీ ఆలయాలకు నిధులు మంజూరు చేసి ఆలయాల అభివృద్ధి చేపట్టాలని అన్నారు. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలను అనుగుణంగా జాతర నిర్వహణ చేపట్టాలని అన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైరు చోరీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండల పరిధిలోని ఎల్‌అండ్‌టీ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని ఎన్పీడీసీఎల్ ఏఈఈ శ్రీకాంత్ మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఏఈఈ ఫిర్యాదు మేరకు దర్యాప్తు జరుగుతుందని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు



వాజేడు: మండల పరిధిలోని మండపాక గ్రామ సమీపంలో సోమవారం జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగపేట మండల పరిధిలోని రమణక్క పేట గ్రామానికి చెందిన పలవురు వెంకటాపురం(కె) మండలంలోని బెస్తగూడెం గ్రామంలో జరిగే దహన సంస్కార కార్యక్రమానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మండపాక గ్రామం వద్దకు రాగానే ఆటో ముందు చక్రం విరిపోవడంతో ఆటో ముందుకు పడింది. దీంతో అ ందులో ఉన్న గుమ్మళ్ల సత్యం కుడి కాలుకు తీవ్ర గా యాలు కాగా కమల అనే మహిళ కుడిచేతికి గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన ఏటూరునాగ రం ప్రభుత్వ వైద్య శాలకు 108లో తరలించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం గ్రామానికి చెందిన కొడారి రజినికాంత్(19) వ్యవసాయంలో పంట దిగుబడి రాకపోవడంతో అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చడం కష్టతరంగా మారడంతో మనస్థాపానికి గురై ఈ నెల 14న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా సోమవారం మృతి చెందాడు. తండ్రి కొడారి పెద్దరాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

అందని ఆయుర్వేద వైద్యం!

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మల్హర్: యూనానీ, హోమియో, ఆయుర్వేదం కనుమరుగవుతుంది. ఇంగ్లీష్ మందులకి డిమాండ్ పెరగడంతో ఆయూష్ కేంద్రాలకు ఆదరణ తగ్గుతోంది. ప్రభుత్వం ఆయూష్ కేంద్రాల పేరుతో అందించే సేవలు క్షేత్రస్థాయిలో రోగులకు అందడం లేదు. అవగాహన లేమి ఒక కారణమైతే, వైద్య సిబ్బంది కొరతతో ఆయూష్ కేంద్రాలను కంపౌండరే నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓ రూంలో ఆయర్వేద కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఈ వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది లేక సక్రమంగా తెరుచుకోవడం లేదు. దీంతో మండల ప్రజలకు ఆయుర్వేదం అందని ద్రాక్షలా మిగిలింది. ఇక్కడ పని చేసిన వైద్యుడు సంవత్సరన్నర క్రితం బదిలీపై వేరే ప్రదేశానికి వెళ్లారు. అప్పటి నుంచి ఈ వైద్యశాలో వైద్యాధికారితో పాటు సిబ్బందిని భర్తీ చేయలేదు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఒక్క ఫార్మసిస్ట్ మినహ ఆస్పత్రిలో ఎవరు లేరు. సంవత్సరానికి పైగా ఈ వైద్యశాలను అధికారులు పట్టించుకున్న దాఖాలు లేవు. రెగ్యూలర్ వైద్యులు లేక పోవడంతో రోగుల సంఖ్య తగ్గుతోంది. వైద్యులు లేక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్న సిబ్బంది నియామకపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోక పోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

ఆయూష్ కేంద్రాలపై జిల్లా స్థాయిలో పర్యవేక్షణ కొరవడింది. ఆయూష్, యూనానీ ఆస్పత్రులు సక్రమంగా పని చేస్తున్నాయా.. లేదా అని కనీస పర్యవేక్షణ లేక పోవడంతో ఇష్టారాజ్యంగా మారింది. ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తున్న మందులు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. తద్వార ఆయుర్వేద వైద్యం చేయించుకోవడానికి రోగులు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆయూష్ కేంద్రం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వైద్యులను నియమించాలి



ఆయుర్వేద వైద్యశాలలో వైద్యులను నియమించాలి. ఏళ్ల నుంచి వైద్యులు, సిబ్బంది లేక ఆయుర్వేద సేవలు అందడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్యులను నియమించి ప్రజలకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి

- సత్యనారాయణ, తాడిచర్ల, మల్హర్

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం తిలకిస్తున్న భక్తులు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లిదేవసమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా ఆలయం ప్రాంగనంలోని కల్యాణ మండలపంలో ఆలయ పురోహితులు రామశర్మ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకున్నారు. కల్యాణ మహోత్సవం అనంతరం ఆలయ ప్రాంగనంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను చేశారు.

యువజనోత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలి

శాయంపేట : యువతలో దాగివున్న కళానైపుణ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యువజన సర్వీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన హనుమకొండలోని జవహర్‌లాల్ స్టేడియంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి యువజనోత్సవాకు మండలంలోని యువతి, యువకులు తరలిరావాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి సోమవారం ప్రకటనలో కోరారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉత్సవాలు జరగుతాయని, 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సుగల వారు పాల్గొనవచ్చని తెలిపారు. జానపద నృత్యం, జానపదగేయం, కథా రచన, పోస్టర్ తయారీ, డిక్లమేషన్, ఫోటోగ్రఫీ పోటీలో పాల్గొనవచ్చని వెల్లడించారు. గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసి ప్రశంస పత్రాలు అందిస్తారని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 20వ తేదిలోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9989603085, 8686731728, 8639299354, 9704839204, 9701765567లకు సంప్రదించగలరని సూచించారు.

మంత్రి సీతక్కను కలిసిన నాయకులు



వెంకటాపురం(ఎం): రామప్పలో పూజలు చేస్తున్న మంత్రి సీతక్క తదితరులు



ములుగు రూరల్: మంత్రికి వినతిపత్రం అందిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు



ములుగు రూరల్: మంత్రిని సన్మానిస్తున్న నాయకులు

ములుగు రూరల్: రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను ట్రైబల్ మిని గురుకులం కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు వాంకుడోత్ నిర్మల సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. యూనియన్ నాయకులతో కలిసి మంత్రిని శాలువాలతో సన్మానించి, పూలమొక్క అందించారు. మిని గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, ఉపాధ్యాయురాళ్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే వెంకటాపురం(ఎం) మండలం రామప్ప ఆలయంలోని రామలింగేశ్వర స్వామిని సీతక్క పలువురు అధికారులతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉపాధ్యాయురాళ్లు మణమ్మ, శ్రీలత, రజిని, పూల్‌బాయి, లత, శిరిష, వర్కర్లు సరోజన, సుశీల, కమల,తదితరులు పాల్గొన్నారు.

317 జీఓను రద్దు చేయాలని మంత్రికి వినతి

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలకు కారణమైన 317 జీఓను రద్దు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హట్కర్ సమ్మయ్య అన్నారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి సీతక్కకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని అన్నారు. పల్లె నాగరాజు, శ్యాంసుందర్, ఉప్పుస్వామి, దిలీప్, నాగరాజు, సారంగపాణి, స్వామి, రమేష్, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

వాజేడు: మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను హైదరాబాద్‌లో కాంగ్రెస్ మండల నాయకులు సోమవారం కలిశారు. మంత్రికి సీతక్కకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. వత్సవాయి జగన్నాథరాజు, శ్రీను, అల్లి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు సహకారం అందిస్తా..



భూపాలపల్లి రూరల్: క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర, పక్కన కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం తరపున దివ్యాంగులకు పూర్తి సహకారాన్ని అందిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం అంబేడ్కర్ స్టేడియంలో దివ్యాంగులు, మహిళా సంక్షేమ శాఖ జిల్లా అధికారి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో దివ్యాంగులకు క్రీడలు నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యనారాయణరావు, కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. ముగింపు సందర్భంగా సాయంత్రం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. దివ్యాంగులు మనోధైర్యాన్ని పెంపొందించుకొని ముందుకు సాగాలన్నారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు దివ్యాంగులకు ప్రయాణించడానికి వాహనం ఏర్పాటు చేసే విధంగా పరిశీలించాలని అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లును కోరారు. కార్యక్రమంలో నాయకులు వంశీకృష్ణ నర్సింగరావు, నీలాంబరం, వంగ నరసయ్య, వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్, ఉద్యాన వన శాఖ అధికారి సంజీవరావు, సీడీపీఓ అవంతి, కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, సల్ల రేణుక పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని జయశంకర్ పార్కులో పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలను పరిశీలించి, అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన గెజిటెడ్ అధికారులు

భూపాలపల్లి అర్బన్ / భూపాలపల్లి రూరల్: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును సోమవారం తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షుడు శామ్యూల్ ఆధ్వర్యంలో పలు శాఖల్లో విధులు నిర్వహిస్తున్న గెజిటెడ్ ఉద్యోగులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గండ్రను శాలువాతో సత్కరించి పూలబొకే అందించారు. అదేవిధంగా తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది, సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు సురేష్ అధ్వర్యంలో సంఘం నాయకులు, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి శ్రీదేవి, వైద్యులు ఎమ్మెల్యేను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా పంచాయతీ ఉద్యోగులు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. భూపాలపల్లి నియోజక వర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు అధికారుల సేవలు ఎంతో అవసరమని వివరించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పరస్పర సహకారంతో రాష్ట్రంలో భూపాలపల్లి నియోజక వర్గాన్ని ముందంజలో నిలపాలని కోరారు.



భూపాలపల్లి అర్బన్: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అధికారులు

యువకులకు ఆట వస్తువుల పంపిణీ



ఆట వస్తువులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

వాజేడు: మండల పరిధిలోని నాగారం పంచాయతీలో సోమవారం యువతకు ఆట వస్తువులను సర్పంచ్ తల్లడి ఆదినారాయణ పంపిణీ చేశారు. క్రికెట్, వాలీబాల్ కిట్లను యువతకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండాలని కోరారు. చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని సూచించారు.

క్రమశిక్షణతో కూడిన విద్య పొందాలి



ట్రైనర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శాయంపేట : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను పొందినప్పుడే భవిష్యత్తులో ఉన్నతంగా ఎదుగుతారని విశ్వాని ఫౌండేషన్ ట్రైనర్ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలలో ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు ప్రతిభ, పాఠాలపై నిర్వహించే కౌన్సిలింగ్ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు, గురువులు చూపిన దారిలో విద్యార్థులు నడవాలన్నారు. ఉపాధ్యాయులు బోధించిన తరగతులను శ్రద్దగా పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు. విజయం సాధించడానికి ఏడు సూత్రాలను అపజయం పొందడానికి ఐదు సూత్రాలను బోధించారు. శ్రీమత్స్య గిరిస్వామి ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు ఫౌండేషన్‌కు విరాళాన్ని అందించారు. అనంతరం ట్రైనర్ ఆంజనేయులును పాఠశాల యాజమాన్యం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మామిడి పృధ్వి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ కేటాయించాలి



మాట్లాడుతున్న సాయి

వాజేడు: ఎమ్మెల్యే, స్త్రీసంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు గిరిజన సంక్షేమ శాఖ కేటాయించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్లతో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలోని ఆదివాసీల కోసం నిరంతరం పాటు బడే వ్యక్తి, ఆదివాసీల కష్ట సుఖాలు తెలిసిన ఆడబిడ్డ సీతక్క అన్నారు. అలాంటి సీతక్కకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా నియమిస్తే ఆదివాసీల బతుకులు మెరుగుపడుతాయని తెలిపారు. ఈ సమావేశంలో సురేష్, నాగేశ్వరావు, శ్రీరామ్మూర్తి ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



గణపురం: కొనుగోలు కేంద్రాన్ని పారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



తాడిచర్లలో..

గణపురం: రైతులు దళారులు, మధ్యవర్తుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో ధాన్యాన్ని విక్రయించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారయణరావు తెలిపారు. సోమవారం మండలంలోని లక్ష్మారెడ్డిపల్లె, గాంధీనగర్ గ్రామాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాలు ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా పని చేస్తాయని తెలిపారు. ఆయన వెంట లక్ష్మారెడ్డిపల్లె సర్పంచ్ ఒద్దుల విజయఅశోక్ రెడ్డి, గాంధీనగర్ సర్పంచ్ మాదం మమతసుధాకర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మల్హర్: మండల కేంద్రంలోని తాడిచర్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వెలమలపల్లెలో సోమవారం చైర్మన్ చెప్యాల రామారావు, సుంకరి సత్యనారాయణ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మల్క రామారావు, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ దేవరవేని రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేడు(మంగళవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణవేణి సోమవారం ఒక ప్రకనటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

అయ్యప్పస్వామి ఆలయంలో దివ్య పడిపూజ

నర్సంపేట : నర్సంపేటలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో 23వ మండల పూజా మహోత్సవం, మహా అన్నదాన కార్యక్రమం ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్‌గుప్తా ఆధ్వర్యంలో సోమవారం కొనసాగాయి. దివ్య పడిపూజ దాతగా సైపా సురేశ్ వ్యవహరించగా ఆలయ అర్చకుడు దేవిశ్ మిశ్రా అభిషేక 18 పడి మెట్లపై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బానోతు వెంకన్న శ్రీలత, దుప్పటి శ్రీలత, గుండు బాజ్జిలు స్వామి వారికి నైవేద్యం సమర్పించి మాలధారులకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాదారపు చంద్రశేఖర్, దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, చింతల కమలాకర్‌రెడ్డి, శ్రీరాముల శంకరయ్య, వంగేటి గోవర్ధన్, దోమకుంట్ల సదానందం, భూపతి లక్ష్మీనారాయణ, శింగిరి కొండ వేణుగోపాల్ ఉన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటా..

దామెర: బీఆర్‌ఎస్ కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని ప్రతిఒక్కరికీ అండగా ఉంటానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండల కేంద్రం సమీపంలోని ఏఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో తనకోసం పనిచేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక, పార్లమెంట్ ఎన్నికల కోసం కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేసి నియోజకవర్గంలో పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివద్ధి కోసం నిరంతరం పనిచేశానని అన్నారు. ఇకపై నిత్యం నియోజవర్గ ప్రజల సమస్యలపై పోరాటం చేసి, సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ మండలాల అధ్యక్షుడు గండు రాము, చంద్రమౌళి, మడికొండ శ్రీను, రాజ్‌కుమార్, సంజీవరెడ్డి, సారంగపాణి, ఎంపీపీలు శంకర్, కళావతి, జెడ్పీటీసీ గరిగె కల్పనకృష్ణమూర్తి, పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితరామకృష్ణ, వరంగల్ మాజీ ఏఎంసీ చైర్మన్ సదానందం, దామెర, పరకాల, నడికూడ, ఆత్మకూరు, గీసుకొండ, సంగెం మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

చేయూత



బియ్యం అందజేస్తున్న సభ్యులు

ములుగు రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన పరికిరాల రవి కుమార్తె సౌమ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను గండ్రకోట సుధీర్‌యాదవ్ ఫౌండేషన్ సభ్యులు సోమవారం పరామర్శించి బియ్యం అందజేసి చేయూతనందించారు. కార్యక్రమంలో ఎనగందుల వెంకటేష్, శ్రవణ్, సాధిక్, రాజు, సతీష్, ప్రదీప్, అంజిత్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.